


**జెండాలు మారినా.. ఎజెండా మారలేదు!**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -106 మంగళవారం 29 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ..

- అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధనల అమలుకు మార్గం సుగమం
- రూ.2,000 దాటిన మర్చంట్ చెల్లింపులపై మాత్రమే ఈ ఛార్జీ వర్తింపు
- సాధారణ, వ్యక్తిగత లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టత
- ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలని కేంద్రం, ఆర్‌బీఐకి కోర్టు నోటీసులు

2లో.




## ప్రమాదకర పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్రం నిషేధం

- మనుషులు, జంతువుల ఆరోగ్యానికి ప్రమాదకరమని వెల్లడి
- నిషేధ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం
- ఈ విషానికి విరుగుడు లేకపోవడమే ప్రధాన ఆందోళన

2లో.




## ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

- రూ. 50 లక్షల ఈడీ అటాచ్‌మెంట్‌ను రద్దు చేసిన అప్పిలేట్ ట్రైబ్యునల్
- డబ్బు ఏసీబీ అధీనంలో ఉన్నందున జప్తు చెల్లదని తీర్పు
- రేవంత్ రెడ్డి సహా మరో ముగ్గురికి అనుకూలంగా ఉత్తర్వులు



**ఢిల్లీ సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):** 2015 నాటి సంచలనాత్మక 'ఓటుకు నోటు' కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భారీ ఊరట లభించింది. ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీ చేసిన రూ. 50 లక్షల ఆస్తుల జప్తు (అటాచ్‌మెంట్) మిగతా 2లో...

# గుజరాత్ వర్సెస్ దేశం

## కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

- ఇది నార్త్ వర్సెస్ సౌత్ కాదు, గుజరాత్ వర్సెస్ దేశం అని వ్యాఖ్య
- ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- రాహుల్ గాంధీని కలిశాకే కాంగ్రెస్‌లో చేరానన్న రేవంత్
- తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కార్ సహకరించడం లేదని విమర్శ

**హైదరాబాద్ సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉత్తర, దక్షిణ భారత్ మధ్య కాకుండా, 'గుజరాత్ వర్సెస్ దేశం' అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. అసోంకు చెందిన 'ప్రతిదిన్' దినపత్రిక "భారత్ తదుపరి అధ్యాయం" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో...



## రూ.11 వేల కోట్లతో పల్లె పండుగ

**నేడు పల్లె పండుగ 3.0 కి శ్రీకారం**

**నెల్లూరు జిల్లా ఉదయగిరిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**




**అమరావతి, సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):** పల్లెల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధివెలుగులు నింపనుంది. పల్లె పండుగ 3.0కు శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా రూ. 11,085 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో భారీఎత్తున అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టనున్నారు. మంగళవారం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ పనులుప్రారంభం కానున్నాయి. గ్రామాల్లో రూ. 2,700 కోట్ల వ్యయంతో6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం జరగనుంది. రూ. 7,550కోట్ల వ్యయంతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులను చేపట్టనుంది. రూ. 300 కోట్లతో పాడి రైతుల కోసం 22,000 మినీ గోకులాలనుప్రభుత్వం నిర్మించనుంది. మరో రూ. 7,550 కోట్ల వ్యయంతో 9,500కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులకు అంకురార్పణ చేయనున్నారు. మిగతా 2లో...




## నాలుగేళ్లు చదివితేనే స్థానికత

- తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత
- నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన
- స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం

## సీఐ అలీ మృతిలో కొత్త కోణం..

- విజయవాడ సీఐ షేక్ అహ్మద్ అలీ మృతిపై అనుమానాస్పద మృతిగా కేసు
- నిరసనకారులు తోయడం వల్లే ఆయన కిందపడ్డారని కానిస్టేబుల్ ఫిర్యాదు
- కింద పడ్డాకే శ్వాస ఇబ్బందులు తలెత్తి గుండెపోటు వచ్చిందని వెల్లడి
- కానిస్టేబుల్ సుధాకర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**విజయవాడ సెప్టెంబరు 28 (జర్నలిస్టు జర్నీ న్యూస్):** విజయవాడలో బందోబస్తు విధుల్లో అస్వస్థతకు గురై మరణించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) షేక్ అహ్మద్ అలీ (54) మృతి కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఇది సహజ మరణం కాదని, తోపులాటలో ఆయన కిందపడిపోవడమే మృతికి కారణమని తోటి సిబ్బంది ఆరోపించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మిగతా 2లో...



## అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదు

**సచివాలయ ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి స్వామి**




- ఉద్యోగులను వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నారని మంత్రి స్వామి ఆరోపణ
- నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టీకరణ
- రెండు క్యాజువల్ లీవులకు ఉన్నతాధికారుల అనుమతి అవసరం లేదన్న మంత్రి

**అమరావతి, సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే 15 వేల మందికి పైగా ప్రమోషన్లు ఇచ్చామని, సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్రమంగా ధర్నాలు చేస్తే సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.

సోమవారం అమరావతిలో మంత్రి స్వామి మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన సర్వీస్ రూల్స్ లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చిందని, తమ ప్రభుత్వం వాటిని సరిదిద్దిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సచివాలయ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించినట్లు వివరించారు.
మిగతా 2లో...

**తులం బంగారం ఇస్తామన్న వాళ్ల ఫొటోలు**

## పోలీస్ స్టేషన్లలో పెట్టాలి!

- భూములకు పట్టాలు ఇప్పించమని అడుగుతున్న రైతుల ఫొటోలు కాదు
- రైతుల మీదకు 4 వేల మంది పోలీసోళ్లను పంపిస్తారా? ఇదేమైనా దండయాత్రా?
- బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు బాధిత రైతులతో కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):** తులం బంగారం ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చి, ఆ తర్వాత ఆ హామీలను మర్చిపోయిన వాళ్ల ఫొటోలు పోలీస్ స్టేషన్‌లో పెట్టాలేగానీ రైతులవి కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తమ భూములకు పట్టాలు ఇప్పించమన్న రైతుల ఫోటోలను పోలీసులతో ఎందుకు తీయించారని ప్రభుత్వాన్ని నిలదీశారు. లంగలు, దొంగలు, ప్రజలకు మాట ఇచ్చి తప్పిన మోసగాళ్ల ఫొటోలే పోలీస్ స్టేషన్లలో ఉండాలన్నారు. న్యాయం చేయమని కోరుతున్న రైతులను వేధించడం దుర్మార్గమన్నారు. మిగతా 2లో...



## ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ..

- గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ
- దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ
- అసెంబ్లీ నుంచి అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయడమే కారణం



# అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదు

**మొదటి పేజీ తరువాయి**

దీనిలో భాగంగా రెండు క్యాజువల్ లీవులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాడుకునే వెసులుబాటు కూడా కల్పించామని చెప్పారు.ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ జరుపుతామని చెబుతూనే, ఈ ఆందోళనలకు జగనే కారణమని మంత్రి స్వామి ఆరోపించారు. "గతంలో రూ.15,000 జీతానికి రెండేళ్లు పనిచేసినప్పుడు నిరసన తెలపని వారు, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. గత పీఆర్సీలో వీరిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?" అని నిలదీశారు.కొన్ని డిమాండ్లపై మంత్రి స్పష్టత ఇచ్చారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఎవరికీ ఇవ్వడం సాధ్యం కాదని, కాబట్టి సచివాలయ ఉద్యోగులకు కూడా ఇవ్వలేమని తేల్చిచెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే చూస్తున్నామని, గత ప్రభుత్వం నియమించిందన్న వివక్ష తమకు లేదని అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసిందే తమ ప్రభుత్వమని గుర్తుచేశారు. వారి సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# నాలుగేళ్లు చదివితేనే స్థానికత

**తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత**

**ఢిల్లీ సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది.

ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది.ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

**మొదటి పేజీ తరువాయి**

ఉత్తర్వులను అప్పిలేట్ ట్రైబ్యునల్ రద్దు చేసింది. రేవంత్ రెడ్డితో పాటు ఈ కేసులోని ఇతర నిందితులకు కూడా అనుకూలంగా ఈ తీర్పు వెలువడింది.జస్టిస్ మునీశ్వర్ నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 14న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కేసులో స్వాధీనం చేసుకున్న రూ. 50 లక్షల నగదును ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సీజ్ చేసి, ట్రయల్ కోర్టులో జమ చేసిందని పిటిషనర్లు తమ వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ట్రైబ్యునల్, వివాదాస్పద నగదు ఇప్పటికే కోర్టు అధీనంలో ఉన్నప్పుడు, దానికి సమానమైన మరో మొత్తాన్ని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జప్తు చేయడం చెల్లదని స్పష్టం చేసింది. నిందితులు ఆ ఆస్తులను బదిలీ చేసే అవకాశం లేనందున ఈడీ అటాచ్‌మెంట్ అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది.2015లో రేవంత్ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో, ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఈ కేసు నమోదైంది. నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ. 5 కోట్ల ఒప్పందంలో భాగంగా రూ. 50 లక్షల అడ్వాన్స్ ఇవ్వజూపారనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. ఆ రూ.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ తెలిపింది. ఈ ఏసీబీ కేసును ఆధారంగా చేసుకునే ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి ఆస్తులను అటాచ్ చేసింది. ఈడీ అటాచ్‌మెంట్‌ను ఖరారు చేస్తూ 2022లో వెలువడిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, వేం కృష్ణ కీర్తన్, రుద్ర శివకుమార్, ఉదయ్ సింహా, బిషప్ హ్యారీ సెబాస్టియన్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం తాజాగా వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది.

# గుజరాత్ వర్సెస్ దేశం

**మొదటి పేజీ తరువాయి**

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) టెండర్లకు కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అనుమతులు నిలిపివేసిందని మండిపడ్డారు. దేశం నిధులను గుజరాత్‌కు మాత్రమే తరలిస్తున్నారని, అందుకే ఇది గుజరాత్ వర్సెస్ దేశం అనే పోరాటంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో కేంద్ర ప్రభుత్వం పెద్ద కుట్రకు పాల్పడుతోందని రేవంత్ ఆరోపించారు. ఈ ప్రక్రియ ద్వారా పేదలు, ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తున్నారని, ఇప్పటికే దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని, భవిష్యత్తులో మరిన్ని ఓట్లు తొలగించే ప్రణాళికతో ఉన్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమం రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్‌ను కేంద్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని దుయ్యబట్టారు.తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న రేవంత్ రెడ్డి, ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై రెండుసార్లు గెలిచానని, అయితే నాటి ప్రభుత్వంతో పోరాడేందుకు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీలో చేరానని తెలిపారు. 2014 తర్వాత తెలంగాణలో పోరాటం ప్రధానంగా కేసీఆర్‌కు, తనకు మధ్యనే జరిగిందని, తాను అసెంబ్లీలో కంటే జైలులోనే ఎక్కువ సమయం గడపాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. 2017లో రాహుల్ గాంధీని కలిసిన తర్వాత కాంగ్రెస్‌లో చేరానని, ఆయనే తన నాయకుడని నిర్ణయించుకున్నానని చెప్పారు. రాహుల్ గాంధీకి వ్యక్తిగత ఎజెండా లేదని, ఆయన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తారని కొనియాడారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌దే ఏకపక్ష ఆధిపత్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రూ.11 వేల కోట్లతో పల్లె పండుగ

**మొదటి పేజీ తరువాయి**

అలాగేరూ. 225 కోట్ల వ్యయంతో ఉద్యానవన శాఖ ద్వారా 50,000 ఎకరాల్లోతోటల పెంపకం, రూ.110 కోట్ల వ్యయంతో 1,000 కిలోమీటర్ల మేజిక్‌డ్రెయిన్ల నిర్మాణంకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.రూ. 200 కోట్లతో బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర పనులకు ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేయనుంది.మొత్తం రూ.11,085 కోట్లతో కేంద్ర వాటాగా రూ.5,391 కోట్లు, రాష్ట్ర వాటా రూ.5,694 కోట్లు ఖర్చు చేయనుంది. వీబీ-జీ రామ్ జీకింద రూ.1,750 కోట్లు, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కింద రూ.3,800కోట్లు, నాబార్డ్, సాస్కీ, ఇతర నిధులతో రూ.2,000 కోట్లతో పనులనుప్రభుత్వం చేపట్టనుంది.ఇదిలా ఉండగా పల్లె పండుగ 1.0 కింద 4 వేల కి.మీ సిసి రోడ్లు,22,514 పశువులషెడ్లు, 21,000 వ్యవసాయ పంట కుంటలు, 64 వేలఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకం పంచాయతీ రాజ్ అండ్ రూరల్‌డెవలప్మెంట్ శాఖ ఇప్పటికే చేపట్టింది. అలాగే పల్లె పండుగ 2.0 కిందరూ. 2,500 కి.మీ సీసీ రోడ్లు, 8 వేల 300 కి.మీ బీటీ రోడ్లు, 15750పశువుల షెడ్లు, 15,500 పశువుల నీటి తొట్టెలు, 86 వేల వ్యవసాయకుంటలు, 82 వేల వ్యక్తిగత సోక్ పిట్లు, 32 కీ.మీ మ్యాజిక్ డ్రైన్లునిర్మాణం పూర్తి చేసింది.తాజాగా పల్లె పండుగ 3.0 కింద రూ.11,085 కోట్లతో గ్రామీణప్రాంతాల్లో భారీ ఎత్తున పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిపల్లెల్లో ప్రగతి వెలుగులు నింపనుంది.

# స్టార్‌షిప్ చరిత్రాత్మక ప్రయోగం.. భారత్ మీదుగా భూమి చుట్టూ 6 సార్లు ప్రదక్షిణ!

**ఢిల్లీ సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):**

ప్రపంచ ప్రఖ్యాత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'స్పేస్‌ఎక్స్' మరో చరిత్రాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. ఆ సంస్థ అభివృద్ధి చేసిన భారీ స్టార్‌షిప్ రాకెట్‌ను తొలిసారిగా కక్ష్యలోకి పంపనుంది. 'ఫ్లైట్ 14'గా వ్యవహరిస్తున్న ఈ ప్రయోగం ఈరోజు (సోమవారం, సెప్టెంబర్ 28) భారత కాలమానం ప్రకారం సాయంత్రం ప్రారంభం కానుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈ ప్రయోగం నిర్ణీత సమయానికే జరగనుంది.ఈ ప్రయోగంలో భాగంగా స్టార్‌షిప్ భూమికి సుమారు 275 కిలోమీటర్ల ఎత్తులో ఆరుసార్లు పరిభ్రమించనుంది. ఈ ప్రయాణ క్రమంలో ఇది భారతదేశం మీదుగా కూడా వెళుతుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 10 గంటల పాటు సాగే ఈ యాత్ర ముగింపులో, స్టార్‌షిప్ చిలీకి పశ్చిమ దిశలో పసిఫిక్ మహాసముద్రంలో సురక్షితంగా ల్యాండ్ (స్ప్లాష్‌డౌన్) అవుతుంది. ఇప్పటివరకు జరిగిన ప్రయోగాలన్నీ సబ్-ఆర్బిటల్ స్థాయిలోనే సాగగా, పూర్తిస్థాయి కక్ష్యలోకి (ఆర్బిటల్) పంపిస్తున్న తొలి ప్రయోగం ఇదే కావడం విశేషం.

# యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ..

**ఢిల్లీ సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):**

ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది.

ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది.

**కొత్త నిబంధనల ప్రకారం ఛార్జీల స్వరూపం**

సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల




నుంచి వ్యాపారులకు (పీ2పీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. అయితే, ఈ ఛార్జీల ప్రభావం సాధారణ వినియోగదారులపై ఎక్కువగా ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఎవరికి మినహాయింపు?**

వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు.

వ్యాపారులకు చేసే రూ.2,000 లోపు చెల్లింపులు పూర్తిగా ఉచితం.

యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు సున్నా-ఎండీఆర్ నిబంధన వర్తిస్తుంది.

అత్యావసర సేవలకు ఫ్లాట్‌గా రూ.5, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02% చొప్పున తక్కువ ఛార్జీలు వర్తిస్తాయి.

**ఇది పన్ను కాదు, సెటిల్‌మెంట్ ఫీజు: కేంద్రం**

కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ, ఈ కొత్త ఛార్జీల వల్ల దాదాపు 96% మర్చంట్ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పన్ను కాదని, కేవలం పేమెంట్ సిస్టమ్‌లో భాగమైన ఒక సెటిల్‌మెంట్ ఫీజు మాత్రమేనని స్పష్టం చేశారు.

ఈ ఛార్జీలు నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరని ఆయన వివరించారు. ప్రస్తుతం స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ, కేంద్రం ఇచ్చే వివరణ అనంతరం సుప్రీంకోర్టు ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుంది

# సీఐ అలీ మృతిలో కొత్త కోణం..

**మొదటి పేజీ తరువాయి**

కానిస్టేబుల్ సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్యనారాయణపురం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

**తోపులాట వల్లే మరణం?**

విజయవాడలో సచివాలయ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో బందోబస్తు విధుల్లో ఉన్న సీఐ అలీని ఆందోళనకారులు నెట్టేశారని, ఈ తోపులాటలో ఆయన కిందపడిపోయారని కానిస్టేబుల్ సుధాకర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కిందపడిన తర్వాత ఆయనకు తీవ్రమైన శ్వాస ఇబ్బందులు తలెత్తాయని, ఆ తర్వాతే గుండెపోటుకు గురయ్యారని తెలిపారు. ఈ ఫిర్యాదుతో సీఐ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఘటన జరిగిన తీరుపై విచారణ ప్రారంభించారు.

**అంతకుముందు ఏం జరిగిందంటే..**

ఆదివారం స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసనల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుంచే సీఐ అలీ విధుల్లో ఉన్నారు. ధర్నాచౌక్/అలంకార్ సెంటర్ వద్ద విధుల్లో ఉండగా, ఆయనకు స్వల్పంగా ఛాతీలో నొప్పి వచ్చింది. వెంటనే సూర్యారావుపేటలోని ఓ ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకున్నారు. అక్కడ కాస్త ఉపశమనం లభించడంతో తిరిగి విధుల్లో చేరారు. అలంకార్ సెంటర్ వద్ద సుమారు 10 నిమిషాల పాటు నిలబడిన తర్వాత ఆయన మరోసారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సిబ్బంది ఆయన్ను జీపులో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే స్పృహ కోల్పోయారు. ఆయన్ను ఆంధ్ర హార్ట్ అండ్ బ్రెయిన్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అయితే, అప్పటికే ఆయన గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ప్రస్తుతం కానిస్టేబుల్ ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఈ కేసును కొత్త కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో అక్కడి పరిస్థితులు, తోపులాట వాస్తవాలు, సీసీటీవీ ఫుటేజీ వంటి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

# ప్రమాదకర పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్రం నిషేధం

**ఢిల్లీ సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):**

ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన కలుపు సంహారకాల్లో (హెర్బిసైడ్) ఒకటైన పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. మానవులు, మూగజీవాల ఆరోగ్యానికి ఇది తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని నిపుణుల కమిటీ నిర్ధారించడంతో ఈ కీలక నిర్ణయం వెలువడింది. ఈ మేరకు జారీ చేసిన నోటిఫికేషన్ తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో పారాక్వాట్‌ను నియంత్రించిన సుమారు 70 దేశాల జాబితాలో భారత్ కూడా చేరినట్లయింది.ఇన్సెక్టిసైడ్స్ యాక్ట్, 1968 నిబంధనల ప్రకారం, నిపుణుల కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీల సిఫార్సుల మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజా ఆదేశాల ప్రకారం పారాక్వాట్ డైక్లోరైడ్‌కు సంబంధించిన కొత్త రిజిస్ట్రేషన్లను తక్షణమే నిలిపివేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను కూడా రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. సదరు సర్టిఫికెట్లను వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని, ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నిషేధాజ్ఞలను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేసింది.

ఎందుకీ నిషేధం?

పారాక్వాట్ డైక్లోరైడ్ అత్యంత విషపూరితమైన రసాయనం. దీనిని స్వల్ప మోతాదులో తీసుకున్నా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది. దీనికి నిర్దిష్టమైన విరుగుడు లేకపోవడం వైద్య రంగంలో పెను ఆందోళన కలిగించే అంశం. ఈ రసాయనం ప్రధానంగా ఊపిరితిత్తులు, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపి, 'పల్మనరీ ఫైబ్రోసిస్' వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుంది.

ఈ కలుపు సంహారకంపై నిషేధం విధించాలని శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు, పర్యావరణవేత్తలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం, దేశంలో 2024లో పురుగుల మందుల కారణంగా సుమారు 34,000 మంది మరణించారు (వీటిలో ఆత్మహత్యలు, ప్రమాదవశాత్తు జరిగిన మరణాలు ఉన్నాయి). ఈ తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం, ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

# తులం బంగారం ఇస్తామన్న వాళ్ల ఫొటోలు పోలీస్ స్టేషన్లలో పెట్టాలి!

**మొదటి పేజీ తరువాయి**

బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోనున్న బహదూర్‌పల్లికి చెందిన రైతులతో సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ పట్టాలిస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని హామీలివ్వలేదా? ఆ మాట చెప్పిన వ్యక్తి మోసం చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫొటో పెట్టాలా? లేక రైతుల ఫొటోలు పెట్టాలా?' అంటూ పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రైతుల ఇళ్ల మీదకు ఏదో పక్క దేశం మీద దండయాత్రకు పోయినట్టు 4 వేల మంది పోలీసోళ్లను పంపారని విమర్శించారు. రైతుల భూముల విషయంలో ప్రభుత్వం వద్ద ఉన్న ఆధారాలను బహిరంగంగా చూపించాలని డిమాండ్ చేశారు. తాము బుల్లెట్ ట్రెయిన్‌కు వ్యతిరేకం కాదని, రియల్ ఎస్టేట్ దందాను మాత్రం ఒప్పుకోమని చెప్పారు. ఏడాది తర్వాత కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తారని, బహదూర్‌పల్లిలోనే మీటింగ్ పెట్టి రైతులకు పట్టాలు అందిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. మరోవైపు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నేతలతో జిల్లాల వారీగా కేటీఆర్ సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీగ్రాఫ్ వేగంగా పడిపోతోందని, యువత దూరమైందనే ఆందోళన ఆ పార్టీ అగ్రనేతలను కలవరపరుస్తోందని, రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత తారస్థాయికి చేరిందన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ముదిరాజ్ సంక్షేమ సంఘం నేతలు సోమవారం కేటీఆర్‌ను కలిశారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సిరిసిల్ల పర్యటనలో ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ..

**గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ**

**దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ**

**అసెంబ్లీ నుంచి అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ**

**హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయడమే కారణం**

**ఉప ఎన్నికలో గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన దానం నాగేందర్**

**హైదరాబాద్, సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణలో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఈ స్థానాన్ని ఖాళీగా గుర్తిస్తూ తెలంగాణ శాసనసభ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు తీర్పును అనుసరించి, 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే ఆయన సభ్యత్వం రద్దయినట్లు ఈ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు.



2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, ఆ పిటిషన్లను స్పీకర్ తిరస్కరించడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ సెప్టెంబర్ 18న కీలక తీర్పు వెలువరించింది. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరఫున లోక్‌సభకు పోటీ చేసిన సమయం నుంచే ఆయనపై అనర్హత వేటు అమల్లోకి వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా ఆయన పిటిషన్ తిరస్కరణకు గురైంది. దీంతో ఆయన శాసనసభ్యత్వం రద్దు అధికారికంగా ఖరారైంది. ప్రస్తుతం ఆయన మాజీ ఎమ్మెల్యే అయ్యారు. మరోవైపు, త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తానే మళ్లీ విజయం సాధిస్తానని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# టీసీసీ మీడియా జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌కు ఘన సన్మానం



**తల్లాడ/ సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) ఖమ్మం జిల్లా మీడియా అధ్యక్షుడిగా ఎన్నికైన నారపోగు ప్రసాద్‌ను తల్లాడ మండలంలోని మన్న బైబిల్ కాలేజీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సోమవారం మన్న బైబిల్ కాలేజీలో పాస్టర్ మేకల ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నారపోగు ప్రసాద్‌కు పూలమాల వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్ మేకల ప్రసాదరావు మాట్లాడుతూ టీసీసీ ఖమ్మం జిల్లా మీడియా అధ్యక్షుడిగా నారపోగు ప్రసాద్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. సన్మానం అనంతరం నారపోగు ప్రసాద్ మాట్లాడుతూ తనను సన్మానించిన మన్న బైబిల్ కాలేజీ నిర్వాహకులు, పాస్టర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీసీసీ మీడియా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు సంతోష్, జోజి, ఆంధ్రప్ప, అంటోని తదితరులు పాల్గొని ప్రసాద్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు.

# మదర్ థెరిస్సా సేవాసదనానికి బియ్యం బ్యాగుల విరాళం




**మధిర/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రానికి సోమవారం మూడు బియ్యం బ్యాగులను విరాళంగా అందజేశారు. వైరా పట్టణానికి చెందిన డాక్టర్ చెదల మోజస్ సోదరుడు, డెహ్రాడూన్‌లో నివాసం ఉంటున్న చెదల ఆరోన్, గడ్డం బ్లెస్సీ దంపతులు ఈ బియ్యం బ్యాగులను అందించారు. మానసిక దివ్యాంగుల పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సేవాసదనానికి బియ్యం అందించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. ఆరోన్, బ్లెస్సీ దంపతులు, వారి పిల్లలు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని మానసిక దివ్యాంగుల పిల్లల తరపున దేవునిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. తమకు దేవుడు ప్రసాదించిన మేలును మానసిక దివ్యాంగుల పిల్లలతో పంచుకుంటూ మూడు బియ్యం బ్యాగులు అందించిన ఆరోన్, బ్లెస్సీ దంపతులకు సేవాసదనం నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలి

### ఖమ్మం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన




**ఖమ్మం/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు, దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపు, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఓట్ల చోరీ వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను వారు తప్పుబట్టారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలిచేలా చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మూడు ముంతల గంగరాజు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, మండల నాయకులు మారెళ్ల మల్లికార్జునరావు, తుమ్మలపల్లి రమేష్, తాళ్ల జోసెఫ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొండగట్టుకు బయలుదేరిన హనుమాన్ స్వాములు

### 41 రోజుల దీక్ష అనంతరం ఇరుముడులతో ప్రయాణం



**స్టేషన్‌ఘన్‌పూర్ /సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లులో హనుమాన్ స్వాములు 41 రోజుల దీక్షను భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. గురుస్వామి అన్నెపు అనిల్ ఆధ్వర్యంలో మాలాధారణ చేసిన స్వాములు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.
సోమవారం ఆంజనేయస్వామి ఆలయం ఎదుట గురుస్వామి అన్నెపు అనిల్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అనంతరం 8వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై స్వాములకు ఇరుముడి కట్టారు. దీక్ష విరమణ కోసం హనుమాన్ స్వాములు కొండగట్టుకు బయలుదేరారు.
ఈ సందర్భంగా కౌన్సిలర్ పొన్న రాజేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ స్వాముల ఆధ్వర్యంలో హోమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పొన్న రాజేష్, గురుస్వామి అన్నెపు అనిల్, బూర్ల రమేష్, బూర్ల ప్రవీణ్, హనుమాన్ స్వాములు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ వివాదం.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దహనం

### మహబూబాబాద్‌లో కాంగ్రెస్ భారీ నిరసన.. రాజీనామాకు డిమాండ్

**మహబూబాబాద్/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ ఆందోళనకు డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ భూక్యా ఉమా మురళీనాయక్ నాయకత్వం వహించారు.
ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా కలెక్టరేట్ వరకు తరలివచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి సీఈసీ జ్ఞానేశ్ కుమార్




దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును పరిరక్షించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

**ఓటు హక్కును కాపాడేందుకు పోరాటం**

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ భూక్యా ఉమా మురళీనాయక్ మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత లోపిస్తే ప్రజాస్వామ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. బీజేపీ ఒత్తిళ్లకు తలొగ్గి రాజ్యాంగాన్ని, ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కాంగ్రెస్ వివిధ విభాగాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాషువా స్ఫూర్తితో సాంస్కృతిక, సామాజిక పోరాటాలు చేపట్టాలి

### కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి

**మహబూబాబాద్/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):**
మహాకవి గుర్రం జాషువా స్ఫూర్తితో కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా సాంస్కృతిక, సామాజిక పోరాటాలను విస్తృతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి పిలుపునిచ్చారు. కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పేరుమాండ్ల జగన్నాథం భవన్‌లో గుర్రం జాషువా 131వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో రామ్మూర్తి మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో సామాజిక అణచివేత, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా జాషువా తన రచనలు, కవిత్వం ద్వారా



ప్రజల్లో చైతన్యం కలిగించారని అన్నారు. సనాతన ధర్మం పేరుతో కొనసాగిన సామాజిక వివక్షను, అగ్రవర్ణ ఆధిపత్య భావజాలాన్ని ఆయన తన సాహిత్యంలో ప్రశ్నించారని గుర్తుచేశారు. నేటి పాలకులు మనువాద భావజాలాన్ని ప్రజలపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రపంచంలోనే అత్యంత దుర్మార్గమైన కుల వ్యవస్థ కారణంగా అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న వివక్షను జాషువా తన కవిత్వం ద్వారా ఎండగట్టారని పేర్కొన్నారు. జాషువా ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు మందుల మహేందర్, గద్దపాటి సంతోష్, అల్వాల ఆనంద్, మచ్చ వెంకన్న, దుడ్డేల బ్రహ్మం, షేక్ ఖాదర్ బాబా, అచ్చ నాగేష్, కిన్నెర నాగరాజు, కిన్నెర శ్రీకాంత్, బేతమల్ల సందీప్, వంకాయల గోపీచంద్, ఆరెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు ఆసరాగా పరపతి సంఘాలు

### నిరుపేద కుటుంబాల అవసరాలకు రుణ సాయం

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):**
పేద కుటుంబాలు, చిరు వ్యాపారులకు పరపతి సంఘాలు ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నాయని శ్రీ భక్త మార్కండేయ పరపతి సంఘం అధ్యక్షుడు కేదాసి వెంకటేశ్వర్లు అన్నారు. హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట సమీపంలోని బాలాజీ గార్డెన్‌లో ఆదివారం శ్రీ భక్త మార్కండేయ పరపతి సంఘం 34వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు కేదాసి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కనుకుంట్ల సతీష్, కోశాధికారి కేదాసి రాకేష్, కార్యదర్శి దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కమిటీ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం



నిర్వహించిన వార్షికోత్సవ సభలో అధ్యక్షుడు కేదాసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 34 ఏళ్ల క్రితం అసంపర్తిలో ప్రారంభమైన శ్రీ భక్త మార్కండేయ పరపతి సంఘం నేడు 34వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సంఘం అభివృద్ధికి సహకరిస్తున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద కుటుంబాల్లో వివాహాలు, చిరు వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం ఒక్కో సభ్యుడికి రూ. 1.50 లక్షల వరకు రుణాన్ని ఒక రూపాయి వడ్డీకి అందిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం మరింత అభివృద్ధి చెందేందుకు సహకరించాలని కోరారు.
కోశాధికారి కేదాసి రాకేష్ వార్షిక లెక్కలను సభ్యులకు వివరించగా, సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. వార్షికోత్సవాన్ని విజయవంతం చేసిన సభ్యులు, కుటుంబ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### ప్రతి ఉద్యోగి ఆన్‌లైన్ ముఖచిత్ర హాజరు నమోదు చేసుకోవాలి

### కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అనిల్‌కుమార్, పురుషోత్తంతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.



అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. గురుకుల హాస్టళ్లు, ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలను సంక్షేమ శాఖల ప్రత్యేక అధికారులు సత్వరమే సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ ముఖచిత్ర హాజరు విధానంలో నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోని పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో 93 అర్జీలు అందగా, ఆర్డీవో కార్యాలయాల్లో 3, ఎంపీడీవో కార్యాలయాల్లో 123 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో నాగలక్ష్మి, డీఆర్డీవో పీడీ మధుసూదనరాజు, డీవీహెచ్ఓ డాక్టర్ కిరణ్‌కుమార్, ఎస్టీ సంక్షేమ అధికారి దేశీరామ్ నాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ రవిరాథోడ్, సీపీఓ శ్రీనివాసరావు, డీహెచ్ఎస్ఓ జీ.మరియన్న, కలెక్టరేట్ ఏవో పవన్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత ముందుకు రావాలి

### దోపిడీ లేని సమాజం కోసం పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన షహీద్ భగత్‌సింగ్ ఆశయాలను సాధించేందుకు యువత ముందుకు రావాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి పల్లె ప్రవీణ్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లె ప్రవీణ్ మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం, దోపిడీ లేని సమాజం కోసం భగత్‌సింగ్ కన్న కలలను




సాకారం చేసేందుకు నేటి యువత కృషి చేయాలని అన్నారు. భగత్‌సింగ్ త్యాగం, పోరాట స్ఫూర్తి యువతకు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యత, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భగత్‌సింగ్ ఆలోచనలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడంతో పాటు ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కుంచాల రమణ, కార్యకర్తలు కన్నీరు శివ, తన్నీరు గోపి, అల్లూరి రూబెన్ తదితరులు పాల్గొని భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు.

# మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను అడ్డుకోవాలి

**పాతాళకుంటలో చేప పిల్లల విడుదలపై సమగ్ర విచారణ జరపాలి**

**మహబూబాబాద్‌లో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో మహా ర్యాలీ, ధర్నా**

**మహబూబాబాద్/ సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** మత్స్యకారుల హక్కులను పరిరక్షించి, వారి సంప్రదాయ వృత్తి, జీవనోపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మహా ర్యాలీ, ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిడుగు శ్రీనివాస్ ముదిరాజ్, మానుకోట జిల్లా అధ్యక్షుడు బిల్ల సహదేవ్, పెనుగొండ గ్రామ ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు పేరాల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మత్స్యకారులు, మత్స్య సహకార సంఘాల సభ్యులు, ముదిరాజ్ మహాసభ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




మహబూబాబాద్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

పాతాళకుంట వివాదంపై విచారణ చేయాలి

కేసముద్రం మండలం పెనుగొండ గ్రామ మత్స్య సహకార సంఘం పరిధిలోని పాతాళకుంటలో గిరిజనులు చేప పిల్లలను విడుదల చేసిన అంశంపై సమగ్ర విచారణ జరపాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు. పాతాళకుంటకు సంబంధించిన హక్కులు, చేపల పెంపకం, చేప పిల్లల విడుదల తదితర అంశాలపై నిబంధనల ప్రకారం అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు.

తమ జీవనోపాధికి నష్టం కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్య సహకార సంఘాల పరిధిలోని చెరువులు, కుంటలపై హక్కులను పరిరక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటి వివాదాలు తలెత్తకుండా స్పష్టమైన విధానాలను అమలు చేయాలని కోరారు.

మత్స్యకారుల సంప్రదాయ వృత్తికి, జీవనోపాధికి భంగం కలగకుండా అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, ముదిరాజ్ మహాసభ నాయకులు, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు, మత్స్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి

## రక్తదానం ప్రాణదానంతో సమానం తక్కలపల్లి శ్రీనివాసరావు

**హసన్‌పర్తి/ సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** మతోన్మాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం యువత ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు.

సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో షహీద్ భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో 'డొనేట్ బ్లడ్‌సేవ్ లైఫ్' పేరుతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తక్కలపల్లి శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో కుల, మత వివక్షకు వ్యతిరేకంగా, అందరికీ సమాన హక్కుల కోసం యువత ముందుకు రావాలని కోరారు. దోపిడీ, పీడన, అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడుతూ సమానత్వ



సమాజ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడానికి యువత ఎలాంటి వెనకడుగు వేయవద్దని, 18 సంవత్సరాలు నిండిన ఆరోగ్యవంతులు వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం బాధ్యతగల పౌరుడి ఉత్తమ లక్షణమని పేర్కొన్నారు. రక్తదానం చేసిన వారికి అనంతరం శ్రీనివాసరావు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యుడు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, నాయకులు ఎన్.ఎ.స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, గుంటి రాజేందర్, పొనుగోటి రాముగోపాల్‌చారి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, జిల్లా ఆఫీస్ బేరర్లు తాటికంటి మమత, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు తదితరులు పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో కోతుల బీభత్సం

**ప్రజల ప్రాణాలకు ముప్పు.. పంటలకు తీవ్ర నష్టం -25 ఏళ్లుగా సమస్య.. శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజావాణిలో వినతి**

**తల్లాడ/ సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** అన్నారుగూడెం గ్రామంలో 25 ఏళ్లుగా కొనసాగుతున్న కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తల్లాడ మండల ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. గ్రామ పెద్ద బొమ్మగాని రామనాథం, బీజేపీ నాయకులు ఆపతి వెంకట రామారావు, పొన్నం కృష్ణయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు అధికారులను కలిసి సమస్య తీవ్రతను వివరించారు. గ్రామంలో ఏళ్ల తరబడి కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిందని, గుంపులుగా వీధుల్లో సంచరిస్తూ ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని తెలిపారు. ఇళ్లలోకి చొరబడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, కోతులు దాడి చేయడం, వెంటపడటంతో పలువురు




గాయపడి ఆసుపత్రుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

**పంటలపై కోతుల దాడులు**

మరోవైపు కోతులు వ్యవసాయ పొలాల్లోకి చొరబడి వరి, పత్తి తదితర పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు తెలిపారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు పొలాల వద్ద నిరంతరం కాపలా ఉండాల్సి వస్తోందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 25 ఏళ్లుగా సమస్య కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం లభించకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి కోతుల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలతో పాటు రైతుల పంటలకు రక్షణ కల్పించాలని కోరారు. గ్రామస్తుల ఫిర్యాదుపై ఎండీఓ స్పందిస్తూ అన్నారుగూడెంలో కోతుల సమస్య తీవ్రంగా ఉన్నట్లు గుర్తించామని, విషయాన్ని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొమ్మగాని రామనాథం, బీజేపీ నాయకులు ఆపతి వెంకట రామారావు, పొన్నం కృష్ణయ్య, వాడవల్లి నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కోతుల దాడులతో బెంబేలు!

## ఇళ్లలోకి చొరబడి చిన్నారులు, వృద్ధులపై దాడులు

## పంట పొలాల్లోనూ బీభత్సం.. పట్టించుకోని అధికారులపై గ్రామస్థుల ఆగ్రహం

**ఎల్కతుర్తి/సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. గుంపులుగా గ్రామంలోకి ప్రవేశిస్తున్న కోతులు ఇళ్లలోకి చొరబడటంతోపాటు రోడ్లపై స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని గ్రామస్థుడు జంపాల వేణు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు, వృద్ధులు, వికలాంగులు కోతుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

అడవుల్లో ఉండాల్సిన వానరాలు గ్రామాల్లోకి వచ్చి ఇళ్లపై, రోడ్లపై తిష్టవేస్తున్నాయని తెలిపారు. ఉదయం వేళ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పనుల నిమిత్తం బయటకు వచ్చే మహిళలు, వృద్ధులు కోతుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కోతులు అకస్మాత్తుగా దాడులకు పాల్పడే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

**పంటలకు భారీ నష్టం**

కోతుల బెడద ఇళ్లకే పరిమితం కాకుండా పంట



పొలాలకూ విస్తరించింది. పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు పొలాల వద్ద కాపలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

కొన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామస్థుల నుంచి నిధులు సమకూర్చుకుని దశలవారీగా కోతులను పట్టించినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని తెలిపారు. మరికొన్ని చోట్ల నిధులు సమకూర్చుకున్నా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయని వేణు పేర్కొన్నారు.



**తక్షణ చర్యలు చేపట్టాలి**

కోతుల బెడదపై అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. కోతులను పట్టించి సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు భవిష్యత్‌లో గ్రామాల్లోకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు, రైతులు, చిన్నారులకు రక్షణ కల్పించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కోరారు.

# బుడోకాన్ కరాటే గ్రేడింగ్ టెస్టుల్లో ఎల్లాపూర్ విద్యార్థుల ప్రతిభ

**ఎల్లో, ఆరెంజ్ బెల్టులు సాధించిన విద్యార్థులు**

**చదువుతో పాటు కరాటేలోనూ శిక్షణ అవసరం దుర్గాప్రసాద్**



**హసన్‌పర్తి/ సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):** బుడోకాన్ కరాటే ఇంటర్నేషనల్ వరల్డ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రేడింగ్ టెస్టుల్లో 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నష్కల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ గ్రేడింగ్ టెస్టుల్లో ఎల్లాపూర్ విద్యార్థులు పాల్గొని ఎల్లో, ఆరెంజ్ బెల్టులను సాధించారు. ఈ కార్యక్రమానికి బుడోకాన్ కరాటే ఇంటర్నేషనల్ వరల్డ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు పాండ దినేష్‌బాబు, సహ కార్యదర్శి రేణుకుంట్ల దుర్గాప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బుడోకాన్ కరాటే ఆర్గనైజర్ పాశం దేవయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డి.శంకర్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎం.డి.సలీం పాషా, సిద్దిపేట రామస్వామి తదితరులు గ్రేడింగ్ టెస్టులను నిర్వహించారు. ఈ సందర్భంగా బుడోకాన్ కరాటే మాస్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో బాలికలపై అఘాయిత్యాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఆత్మరక్షణ కోసం చదువుతోపాటు కరాటేలోనూ శిక్షణ పొందాలని సూచించారు. కరాటే శిక్షణతో పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరుగుతాయని తెలిపారు. తల్లిదండ్రులు ముఖ్యంగా బాలికలను కరాటే నేర్చుకునేలా ప్రోత్సహించాలని కోరారు.

# తాటిపూడిలో రెండు ఇళ్లలో చోరీ

**తాళాలు పగలగొట్టి బంగారం, వెండి, నగదు అపహరణ**

**వైరా/సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త):** వైరా మండలం తాటిపూడి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. వరుసగా రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి బంగారం, వెండి వస్తువులు, నగదును అపహరించారు. ఈ ఘటనతో గ్రామంలో కలకలం రేగింది. గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి పతాని సునీత ఇంట్లో సుమారు రూ.25 లక్షల విలువైన 15 తులాల బంగారం, రెండున్నర కిలోల వెండి వస్తువులు, నగదును దొంగలు అపహరించినట్లు బాధితులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన దోసపాటి రాజేశ్వరరావు ఇంట్లో సుమారు రూ.4 లక్షల విలువైన రెండు తులాల బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.30 వేల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాలను పరిశీలించి క్లూస్ టీమ్ ద్వారా వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై పి. రామారావు తెలిపారు.



# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**స్టేషన్ ఘన్‌పూర్/ సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన రొడ్డ ఎల్లయ్య మృతి చెందారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండటంతో కనీసం దహన సంస్కారాలు నిర్వహించేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ చల్ల ఉమా సుధీర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి స్పందించారు.

మృతుడి కుమారుడు రొడ్డ రాజు కుటుంబ పరిస్థితిని గమనించిన వారు తమ అనుచరులతో కలిసి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజన శ్రీనివాస్, బూసిరెడ్డి మల్లారెడ్డి, వార్డు సభ్యుడు బొల్లం నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ మారపాక వసంత్, గ్రామ నాయకులు మారపాక రాములు, గుండె యాదగిరి, బొప్పె శంభయ్య, రాజారపు మల్లేశం, పులి రవి, దామెర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన జంగా రాఘవరెడ్డి

**స్టేషన్ ఘన్‌పూర్/ సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘన్‌పూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగుల మధుసూదన్ రెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సోమవారం కొత్తపల్లి గ్రామానికి చేరుకున్నారు. మధుసూదన్ రెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన జంగా రాఘవరెడ్డి. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముక్కెర స్వరూప రవి యాదవ్, ఉప సర్పంచ్ ఇసాక్, సివిల్ కాంట్రాక్టర్ గంగుల మనోరంజన్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బూరు వెంకటేశ్వర్లు, చెవుల యాదగిరి, మారబోయిన వెంకటేశ్వర్లు, సయ్యద్ అస్మత్ అలీ, గంగుల జగన్ రెడ్డి, పులిగిల్ల గట్టయ్య, మారబోయిన గట్టుమల్లు, నరేందర్, నరసింహాచారి, వెంకటస్వామి, మారబోయిన దశరథం తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారులను ఆశీర్వదించిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్

**కేసముద్రం/సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ 1వ వార్డుకు చెందిన మేకరబోయిన మహేశ్వరిరమేష్ దంపతుల కుమార్తె కారుణ్య నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుక, కుమారుడు ప్రణదీప్ పంచకట్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీతవెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమనాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండి సుజాత, తుమికి శ్రీదేవి, స్థానిక ప్రజలు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్ట్ వార్త TELTEL/2023/87607
అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక
మంగళవారం 29 సెప్టెంబర్ 2026

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

**కొత్తపేట తండాలో గృహప్రవేశాలు.. లబ్ధిదారులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు**



**దామరచర్ల/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. దామరచర్ల మండలం కొత్తపేట తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. నూతన గృహాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి. లబ్ధిదారుల కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సొంతింటిలోకి అడుగుపెట్టిన లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా తమ సొంతింటి కల సాకారమవుతున్నందుకు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్‌గా బొడ్డు దయాకర్ మాదిగ

**సామాజిక ఉద్యమాల్లో క్రియాశీల పాత్రకు జాతీయ స్థాయిలో గుర్తింపు**

**ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు పోరాటంలో ముందంజ**



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త)** ఎంఆర్పీఎస్ అనుబంధ విభాగమైన మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎంఆర్పీఎస్ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో సుదీర్ఘకాలంగా సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న బొడ్డు దయాకర్ మాదిగకు ఎంఈఎఫ్ జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన పలు సామాజిక ఉద్యమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్‌గా బొడ్డు దయాకర్ మాదిగ ఎన్నిక కావడంపై ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ ఉమ్మడి జిల్లా నాయకులు, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు ఘనంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# నరేన్ హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

**వందలాది మందికి ఉచిత ఫైబ్రో స్కాన్ పరీక్షలు.. వైద్యుల సూచనలతో చికిత్స**



**వైరా/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** వైరా పట్టణంలోని నరేన్ హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి వైరా పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన గ్రామీణ ప్రజలకు ఉచితంగా ఫైబ్రో స్కాన్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో వందలాది మంది ప్రజలు స్కానింగ్ పరీక్షలు చేయించుకుని తమ ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల నుంచి సలహాలు పొందారు. అనంతరం జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ శ్రీహర్ష పరీక్షా ఫలితాలను పరిశీలించి, అవసరమైన వారికి తగిన వైద్య సూచనలు, చికిత్స అందించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ఉచిత వైద్య సేవలను నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రజలకు, వైద్య సిబ్బందికి డాక్టర్ శ్రీహర్ష కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే మరిన్ని ఉచిత వైద్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిందెవరు?

**తప్పుడు ప్రచారాలు మానుకోవాలి.. దమ్ముంటే ఫొటోల్లో చూపించండి**



**స్టేషన్ ఘన్‌పూర్/ సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** చిల్పూర్ మండలం రాజవరం గ్రామం నుంచి బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారంటూ చేస్తున్న ప్రచారాన్ని బీజేపీ చిల్పూర్ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రకటించడం వాస్తవానికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా గంటె ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ. బీజేపీ కార్యకర్తలు ఎవరూ కాంగ్రెస్ పార్టీలో చేరలేదని తెలిపారు. బీజేపీకి చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీజేపీ నాయకులు ఉన్నారని చెబుతున్న వారు. ఫొటోల్లో బీజేపీ నాయకులను చూపించాలని సవాల్ చేశారు. బీజేపీ కార్యకర్తలు పార్టీ మారకుండానే కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రకటించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను బీజేపీ సహించబోదని హెచ్చరించారుద

# పాతాళకుంటలో చేప పిల్లల విడుదలపై విచారణకు డిమాండ్

**మహబూబాబాద్/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త)**



కేసముద్రం మండలం పెనుగొండ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలోని పాతాళకుంట చెరువులో నిబంధనలకు విరుద్ధంగా చేప పిల్లలు విడుదల చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 15న సంఘానికి, మత్స్యశాఖకు సమాచారం లేకుండా చేప పిల్లలు విడుదల చేశారని, అడ్డుకునేందుకు ప్రయత్నించిన సంఘ సభ్యుల తెప్పలు, గుడిసెలు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఘటనపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. చెరువు లీజు రికార్డులు, బైలా, మత్స్యశాఖ రికార్డులను పరిశీలించి చట్టబద్ధమైన హక్కులను స్పష్టం చేయాలని కోరారు. మత్స్యకారులకు బెదిరింపులు లేకుండా పోలీసు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్ ముదిరాజ్, కొత్తూరు రమేష్ ముదిరాజ్, సురబోయిన రవి ముదిరాజ్, గుండెల శ్రీను ముదిరాజ్, బోయిన వెంకన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి సొసైటీకి కొత్త పాలకవర్గంతోనైనా

# పునర్వైభవం వస్తుందా?

**30న 70వ సర్వసభ్య సమావేశం.. అభివృద్ధిపై సభ్యుల్లో ఆశలు**

**ముల్కనూరు సొసైటీతో పోలిస్తే వెనుకబాటు.. కార్యాచరణపై రైతుల దృష్టి**






**ఎల్కతుర్తి/ సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి ది విశాల సహకార సంఘం 70వ సర్వసభ్య సమావేశానికి సిద్ధమవుతోంది. ఈ నెల 30న నిర్వహించనున్న సమావేశంపై సంఘ సభ్యులు, రైతుల్లో ఆసక్తి నెలకొంది. 1957లో కొద్దిమంది రైతులతో ప్రారంభమైన ఈ సంఘంలో ప్రస్తుతం సుమారు 5,800 మంది సభ్యులు ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించలేదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పాలకవర్గాల పనితీరు, సంఘ అభివృద్ధి, ఆర్థిక పరిస్థితిపై సమావేశంలో చర్చ జరగాలని వారు కోరుతున్నారు.

**కుర్చీల పోరుతో అభివృద్ధి వెనుకబడిందా?**

సహకార సంఘం లక్ష్యం రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ సేవలు అందించడంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే. అయితే ఎల్కతుర్తి సంఘంలో పాలకవర్గాల మధ్య విభేదాలు, పదవులపై పోటీ, నిర్ణయాల్లో సభ్యులు, డైరెక్టర్లకు తగిన ప్రాధాన్యం లేకపోవడం వంటి అంశాలు సంఘ అభివృద్ధికి ఆటంకంగా మారాయని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. సొంత నిర్ణయాలకు ప్రాధాన్యం ఇచ్చిన కారణంగా సంఘం వెనుకబడిందని వారు అభిప్రాయపడుతున్నారు.

**ముల్కనూరుతో ఎందుకు వ్యత్యాసం?**

ఎల్కతుర్తికి సమీపంలోని ముల్కనూరు సహకార సంఘం అభివృద్ధిని సభ్యులు ఉదాహరణగా చూపుతున్నారు. 1956లో కొద్దిమంది సభ్యులతో ప్రారంభమైన ముల్కనూరు సొసైటీ ప్రస్తుతం వేలాది మంది సభ్యులతో విస్తరించి, వ్యవసాయంతోపాటు పాల వ్యాపారం, బియ్యం, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు వంటి అనేక సేవలను అందిస్తున్నదని సభ్యులు పేర్కొంటున్నారు. సంఘం భారీ టర్నోవర్‌తో ముందుకు సాగుతూ రైతులకు బోనస్‌లు అందిస్తున్నదని చెబుతున్నారు. మరోవైపు ఎల్కతుర్తి సంఘం అంచనాల ప్రకారం సుమారు రూ.63 కోట్ల టర్నోవర్, రూ.74 లక్షల వార్షిక ఆదాయంతో కొనసాగుతోందని సభ్యులు తెలిపారు. ఇరు సంఘాలు దాదాపు ఒకే కాలంలో ఏర్పాటైనప్పటికీ అభివృద్ధిలో ఇంత వ్యత్యాసం ఎందుకు వచ్చిందనే ప్రశ్నను వారు లేవనెత్తుతున్నారు.

**కొత్త పాలకవర్గంపై రైతుల ఆశలు**

ఇటీవల కొత్త పాలకవర్గం ఏర్పడటంతో ఎల్కతుర్తి సొసైటీ సభ్యుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కొత్త చైర్మన్, డైరెక్టర్లు సంఘాన్ని పటిష్టం చేసేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల వారీగా సభ్యుల సమస్యలను తెలుసుకుని, అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని సూచిస్తున్నారు.

ముల్కనూరు సొసైటీ తరహాలో విభిన్న సేవలను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు సంఘాన్ని లాభాల బాటలో నడిపించి రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చాలని సభ్యులు కోరుతున్నారు. ప్రతి సభ్యుడికి పాడి పశువులు అందించాలని డిమాండ్ వ్యవసాయ రుణాలతోపాటు పాడి పరిశ్రమను ప్రోత్సహించేలా ప్రతి సభ్యుడికి రెండు గేదెలను అందించే విధంగా రుణ పథకాన్ని రూపొందించాలని కొందరు సభ్యులు సూచించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి చెందితే గ్రామాల్లో పాల ఉత్పత్తి పెరిగి, రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని వారు పేర్కొన్నారు. సహకార సంఘం ద్వారా వ్యవసాయం, పాడి పరిశ్రమ రెండింటినీ ప్రోత్సహిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.

ఈ నెల 30న జరిగే 70వ సర్వసభ్య సమావేశంలో సంఘం ఆర్థిక పరిస్థితి, గత పాలకవర్గాల పనితీరు, భవిష్యత్ కార్యాచరణ, రైతులకు అందించాల్సిన సేవలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని సభ్యులు కోరుతున్నారు. కొత్త పాలకవర్గం అయినా సంఘానికి పునర్వైభవం తీసుకువస్తుందా? అనే చర్చ ప్రస్తుతం రైతుల్లో సాగుతోంది.

# స్మార్ట్ రేషన్ కార్డులతో పేదలకు భరోసా

**కేసముద్రంలో అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ -రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు.. ప్రజా ప్రభుత్వంలో వేగం**

**కేసముద్రం/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ అమీనాపురంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బానోతు సునీత వెంకన్న, వైస్ చైర్మన్ అల్లం రమా నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కౌన్సిలర్లు పాయిరాల శరత్, పురం రాజమణి, సింగిల్ విండో వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పాత తరహా కాగితపు కార్డులకు బదులుగా క్యూఆర్ కోడ్‌తో కూడిన ఏటీఎం తరహా స్మార్ట్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం, ఇతర సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన పేదలందరికీ



ఇళ్లు అందించే కార్యక్రమానికి కూడా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

**రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు**

రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి సహకారంతో, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, ఎంపీ బలరాంనాయక్ నేతృత్వంలో కేసముద్రం మండలం, మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆర్‌అండ్‌బీ రహదారులు, సెంట్రల్ లైటింగ్, 50 పడకల ఆస్పత్రి వంటి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫైర్ స్టేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంజూరు చేయడంతో ప్రజల దీర్ఘకాలిక నిరీక్షణకు తెరపడిందన్నారు.

రూ.69 కోట్లతో వెయ్యి మంది విద్యార్థులకు హాస్టల్ వసతితో కూడిన పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణం, డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల మున్సిపల్ భవన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కేసముద్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తరాల వీరేష్ యాదవ్, రావుల వినయ్‌రెడ్డి, వేముల భారతి, కనుకుల సుభద్ర, వల్లందాస్ ఉమా, బానోతు విజయ, జాటోత్ సుజాత, మేకల శారద, బానోతు అరుణ, ఆర్ఐ అనిల్‌కుమార్, జీపీఓ సుధాకర్, రేషన్ డీలర్ మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు

# ఓరుగల్లు కళా వైభవానికి కీర్తి కిరీటం

**ఈగ మల్లేశంకు కాకతీయ కీర్తి పురస్కారం**










**హన్మకొండ/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో ఈగ మల్లేశం చేస్తున్న సేవలకు గుర్తింపుగా కాకతీయ కీర్తి పురస్కారం అందించారు. హన్మకొండ కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కాకతీయ కళా వైభవం 41వ వార్షిక వసంతోత్సవాల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం, ప్రశంసాపత్రం అందుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళలు సమాజానికి జీవనాడులని, కాకతీయుల చారిత్రక కళా వైభవాన్ని, తెలంగాణ జానపద సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కళాకారుల సంక్షేమం, సంస్కృతి పరిరక్షణకు ఈగ మల్లేశం చేస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన ఈగ మల్లేశం మాట్లాడుతూ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఒగ్గుకథ, చిందు యక్షగానం, పేరిణి నృత్యం, బతుకమ్మ, బోనాలు, జానపద గీతాలను పరిరక్షించడంతోపాటు వాటినే నమ్ముకుని జీవిస్తున్న కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, జానపద కళల గొప్పతనాన్ని పరిచయం చేయాలని కోరారు.

# 50 శాతం రాయితీపై వేరుశనగ విత్తనాలు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):**నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం కింద ఎంపికైన రైతులకు 50 శాతం రాయితీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. నారాయణగిరి రైతువేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు విత్తనాలను అందజేశారు. సర్పంచి పుట్ట రేణుక, మండల వ్యవసాయ అధికారి రాజేష్, ఏఈఓ ముజాహిద్దీన్, రైతులు పాల్గొన్నారు.






**లైసెన్సు దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి**

ధర్మసాగర్ మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి రాజేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. తప్పనిసరిగా రసీదు తీసుకుని భద్రపరచుకోవాలని తెలిపారు. నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే గ్రామస్థాయిలోని నిఘా సమితులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

# కస్తూరిబాలో నిర్లక్ష్యపు నీడలు!





**వర్ధన్నపేట/సెప్టెంబర్ 28(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట మండలం ఇల్లందలోని కస్తూరిబా గాంధీ బాలికల వసతిగృహంలో సిబ్బంది భద్రతపై ఆరోపణలు తలెత్తుతున్నాయి. వంట చేస్తుండగా వేడి నీళ్లు పడి వంట సిబ్బంది విజయలక్ష్మి గాయపడటంతో 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గతంలో మిక్సీ బ్లేడ్ ఊడిపోయి ఓ సిబ్బంది వేలు తెగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వరుస ఘటనల నేపథ్యంలో వంట పరికరాల నిర్వహణ, చిన్నపాటి మరమ్మతులపై ప్రత్యేక అధికారి దృష్టి సారించడంలేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. గత ఘటనపై ప్రత్యేక అధికారిని వివరణ కోరగా నాకేం తెలియదు.ఆరోపించిన వారినే అడగండి అని సమాధానం ఇచ్చినట్లు సమాచారం. వసతిగృహంలోని వంట పరికరాలు, విద్యుత్ వ్యవస్థ, మౌలిక వసతులను ఉన్నతాధికారులు తనిఖీ చేసి లోపాలను సరిచేయాలని సిబ్బంది కోరుతున్నారు. ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బదిలీల అంశంపైనా అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# శ్రీ చైతన్యలో సందడిగా 'నాయకుల' ప్రమాణ స్వీకార మహోత్సవం.





**బయ్యారం/,సెప్టెంబర్ 28.(జర్నలిస్ట్ వార్త)**స్థానిక శ్రీ చైతన్య స్కూల్ (1-బ్రాంచ్)లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థి నాయకుల పదవీ ప్రమాణ స్వీకార వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సి.పి.ఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి నూతన నాయకులకు బ్యాడ్జీలు తొడిగి ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటే అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని పేర్కొన్నారు.ఎంపికైన విద్యార్థి నాయకులు:స్కూల్ హెడ్ బాయ్ జీతూవర్ధన్,హెడ్ గర్ల్ భవిష్య,డిప్యూటీ హెడ్ బాయ్ సైఫ్ ఖాన్,డిప్యూటీ హెడ్ గర్ల్ ధృవిత, స్పోర్ట్స్ కెప్టెన్ శ్రీతన్,సీసీఏ కెప్టెన్ హన్సిక మలాని,కింగ్స్ హౌస్ కెప్టెన్ పీయూష్ లోయ,డిప్యూటీ తపస్వి, రాయల్స్ కెప్టెన్ హస్నైన్,డిప్యూటీ భవజ్ఞ చౌహాన్,ఫారోస్ కెప్టెన్ అనాస్, డిప్యూటీ కార్తీక్ రెడ్డి,సీజర్స్ కెప్టెన్ హర్ష,డిప్యూటీ - సాహితీ బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మదార్,డీన్ విద్యాసాగర్, సి-బ్యాచ్ ఇన్‌ఛార్జ్ మల్లేశం, కుమారస్వామి, సురంభ,ఏఓ సుధాకర్, పిఈటిలు యాకయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం ఆయకట్టును కాపాడండి

**-ఈఎన్‌సీకి ఎమ్మెల్యే కనకయ్య వినతి.**

**బయ్యారం/,సెప్టెంబర్ 28.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం పెద్ద చెరువు ఆయకట్టు పరిధిలో సాగు చేసిన సుమారు 4,000 ఎకరాల వరి పంటలకు అవసరమైన నీటిని అందించి పంటలను రక్షించేందుకు చెరువు నుంచి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్ కు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వినతిపత్రం సమర్పించారు.భారీ వర్షాలతో చెరువు పూర్తిగా నిండినప్పటికీ, ప్రస్తుతం సాగు చేసిన వరి పంటలకు అవసరమైన సమయంలో నీటి విడుదల లేకపోవడంతో పంటలపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.ప్రస్తుతం చెరువులో ఉన్న నీటిని శాస్త్రీయంగా అంచనా వేసి,పంటల అవసరాలకు అనుగుణంగా దశలవారీగా నీటిని విడుదల చేయడం ద్వారా వరి పంటలను కాపాడవచ్చని పేర్కొన్నారు.బయ్యారం,గార్ల మండలాల రైతుల నీటి అవసరాలను సమన్వయం చేస్తూ తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రూపొందించిన నివేదికను కూడా ప్రధాన కార్యదర్శికి ఎమ్మెల్యే సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ చైర్మన్ బానోత్ రాంబాబు,కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్,సొసైటీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.ద

# గంజాయి విక్రయానికి తరలిస్తుండగా పట్టివేత

## కిలో ఎండు గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

**వర్ధన్నపేట/ సెప్టెంబరు 28 (జర్నలిస్ట్ వార్త):**
గంజాయిని విక్రయించేందుకు తరలిస్తున్న ఇద్దరిని వర్ధన్నపేట పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి కిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. వర్ధన్నపేట మండలం కాట్ర్యాల గ్రామానికి చెందిన ముత్యాల శ్యామ్, వర్ధన్నపేట పట్టణానికి చెందిన పిన్నింటి భరత్ కొంతకాలంగా గంజాయి సేవిస్తున్నట్లు తెలిపారు. సుమారు పది రోజుల క్రితం శ్యామ్ అరకు ప్రాంతానికి వెళ్లి ఎండు గంజాయిని తీసుకొచ్చి కాట్ర్యాలలోని తన ఇంట్లో ఉంచినట్లు పేర్కొన్నారు. అనంతరం ఇద్దరూ కలిసి గంజాయిని వర్ధన్నపేటలో




విక్రయించేందుకు తీసుకువస్తుండగా ఇల్లంద గ్రామ శివారులోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు రూ.50 వేల విలువైన కిలో గంజాయితో పాటు భరత్ వినియోగించిన జియో భారత్ కీప్యాడ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. మండలంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, సేవనంపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.రాజు, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులారా ఓటరుగా నమోదు చేసుకోండి.

**-బయ్యారం తహసీల్దార్ పిలుపు.**

**బయ్యారం/,సెప్టెంబర్ 28.(జర్నలిస్ట్ వార్త)**



వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నూతన ఓటరు జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభమైనట్లు బయ్యారం తహసీల్దార్ చప్పిడి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.నవంబర్ 1,2026 నాటికి కనీసం మూడేళ్ల ముందే (అంటే నవంబర్ 1,2023 నాటికి,అంతకంటే ముందు)గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ/పట్టభద్రత పూర్తి చేసిన వారు మాత్రమే ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు.దరఖాస్తులను సెప్టెంబర్ 28 నుండి నవంబర్ 6 వరకు వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు.అర్హత కలిగిన పట్టభద్రులు ఫామ్-18 ద్వారా దరఖాస్తు పాటు డిగ్రీ సర్టిఫికేట్ నకలు ఆధార్ కార్డ్,ఓటర్ ఐడీ జతచేసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించలన్నారు.ఈసిఐ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా నేరుగా దరఖాస్తు చేయవచ్చన్నారు.గతంలో ఓటరుగా నమోదు చేసుకున్న వారు కూడా ఈ కొత్త జాబితా కోసం మళ్లీ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని,అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే ఓటరుగా నమోదు కావలసిందిగా తహసీల్దార్ చప్పిడి నాగరాజు కోరారు.

# జెండాలు మారినా.. ఎజెండా మారలేదు!

## మూడు దశాబ్దాల మందకృష్ణ మాదిగ ప్రస్థానం.

### ఉద్యమం, వ్యూహం, సామాజిక న్యాయ పోరాటం

సామాజిక ఉద్యమం అంటే నినాదం కాదు.. నిరంతర పోరాటం. సమస్యను గుర్తించడం.. ప్రజల సమస్యగా మార్చడం.
పాలకుల ముందుకు తీసుకెళ్లడం. స్పందించకపోతే అదే పాలకులను ప్రశ్నించడం. మూడు దశాబ్దాలకు పైగా మందకృష్ణ మాదిగ ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఈ రాజకీయ-సామాజిక వ్యూహం స్పష్టంగా కనిపిస్తుంది.
నిరుపేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన మందకృష్ణ మాదిగ. పెద్దగా ఆర్థిక, విద్యా అండ లేకపోయినా ఒక ఆలోచనను ఉద్యమంగా మలిచారు. గ్రామస్థాయి కమిటీల నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి నిర్మాణాల వరకు ఉద్యమాన్ని విస్తరించారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల ద్వారా కార్యకర్తల బలాన్ని నిర్మించారు. నాయకుడి ప్రసంగం కంటే ఉద్యమ నిర్మాణానికే ప్రాధాన్యం ఇచ్చారు.



**వర్గీకరణే కేంద్ర బిందువు**

మాదిగ దండోరా ఉద్యమానికి ఎస్సీ వర్గీకరణ ప్రధాన ఎజెండాగా మారింది. మూడు దశాబ్దాలకు పైగా సాగిన పోరాటం ఈ అంశాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటి జాతీయ చర్చగా తీసుకెళ్లింది. 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు రాజ్యాంగపరమైన అవకాశం ఉందని తీర్పు ఇవ్వడం కీలక మలుపుగా మారింది.
అయితే ఇది ఒక్క వ్యక్తి సాధించిన ఫలితమని చెప్పడం చరిత్రను సరళీకరించడమే. ఉద్యమాల ఒత్తిడి.. ప్రభుత్వాల నిర్ణయాలు. కమిషన్ల అధ్యయనాలు.. న్యాయస్థానాల తీర్పులు.. శాసన ప్రక్రియ ఇవన్నీ కలిసి ఈ పరిణామానికి దారితీశాయి. ఆ ప్రక్రియలో మాదిగ దండోరా ఉద్యమం నిరంతరం ఒత్తిడి తెచ్చిన సామాజిక శక్తిగా నిలిచింది.

**అధికారం ఎవరిదైనా.. ఎజెండా మాత్రం అదే!**

మందకృష్ణ మాదిగ రాజకీయ వ్యూహంలో ప్రధాన అంశం ఇదే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాల కాలంలోనూ. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ కాలంలోనూ. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కాలంలోనూ తన డిమాండ్లను ముందుకు తీసుకెళ్లారు.
కేంద్రంలో బీజేపీ అయినా.. ప్రతిపక్ష పార్టీ అయినా.. వామపక్షాలైనా అవసరాన్ని బట్టి మద్దతు, అవసరమైనప్పుడు ప్రశ్నించడం. ఇదే ఆయన రాజకీయ వ్యూహంగా కనిపిస్తుంది.
అందుకే 'ఎవరికి మద్దతు? అన్నది అసలు ప్రశ్న కాదు. 'ఏ సమస్య కోసం మద్దతు? ఎప్పుడు మద్దతు? ఎప్పుడు ఉద్యమం? అన్నదే అసలు ప్రశ్న.

**మద్దతు శాశ్వతం కాదు.ఎజెండానే శాశ్వతం**

ప్రభుత్వం స్పందిస్తే చర్చ.హామీ. మద్దతు. స్పందించకపోతే ధర్నా.రాస్తారోకో.నిరసన.. ఉద్యమం. పాలకులు మారినా ఈ కార్యాచరణ కొనసాగింది. రాజకీయ మిత్రులు మారినా ప్రధాన సామాజిక డిమాండ్ మాత్రం మారలేదన్నది ఈ ప్రస్థానంలోని ముఖ్యమైన అంశం.
మాదిగల సమస్యతో ప్రారంభమైన ఉద్యమం క్రమంగా వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, పేదలు, విద్యార్థుల సమస్యలను కూడా ముందుకు తెచ్చింది. సంక్షేమం, హక్కులు, సామాజిక న్యాయం వంటి విస్తృత అంశాలపై ప్రభుత్వాలను ప్రశ్నించింది.

**రెండు రాష్ట్రాలు.. ఒకే ప్రశ్న**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విడిపోయినా వర్గీకరణ ప్రశ్న మాత్రం రెండు రాష్ట్రాల్లోనూ కొనసాగింది. తెలంగాణలో 2025లో ఎస్సీ ఉపవర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ చంద్రబాబు ప్రభుత్వం 2025లో ఉపవర్గీకరణ అమలుకు చర్యలు చేపట్టింది.
అంటే మూడు దశాబ్దాల క్రితం లేవనెత్తిన ప్రశ్న ఇప్పుడు పాలనా నిర్ణయాల స్థాయికి చేరింది. కానీ అసలు పరీక్ష ఇప్పుడే మొదలైంది.

**వర్గీకరణ అమలైంది.. మరి దాని ఫలాలు చివరి అర్హుడి గడపకు చేరాయా?**

విద్యలో.ఉద్యోగాల్లో. అవకాశాల్లో.సామాజిక ప్రాతినిధ్యంలో నిజమైన మార్పు ఎంత వచ్చింది? ఈ ప్రశ్నలకు సమాధానం దొరికినప్పుడే సామాజిక న్యాయం ఎంతవరకు సాధ్యమైందో తెలుస్తుంది.
మందకృష్ణ మాదిగను కేవలం ఒక వ్యక్తిగా చూడటం ఆయన ప్రస్థానాన్ని చిన్నచూపు చూడటమే. ఒక సామాజిక డిమాండ్‌ను మూడు దశాబ్దాల పాటు రాజకీయ ఎజెండాలో నిలబెట్టిన ఉద్యమ నాయకత్వంగా ఆయన ప్రస్థానాన్ని చూడాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆ ఉద్యమంపై ఉన్న విమర్శలు, భిన్నాభిప్రాయాలు కూడా ప్రజాస్వామ్య చర్చలో భాగమే.జెండాలు మారాయి.ప్రభుత్వాలు మారాయి.. రాజకీయ మిత్రులు మారారు. కానీ ఎజెండా మారలేదు.అదే మందకృష్ణ మాదిగ ప్రస్థానం చెప్పే రాజకీయ పాఠం.
ఉద్యమం వ్యక్తిని మించి నిలబడితేనే చరిత్ర. సాధించిన హక్కు చివరి మనిషికి చేరితేనే సామాజిక న్యాయం.

**బిర్రు కరుణాకర్**
**జర్నలిస్ట్ వార్త సి ఈ ఓ, ఏడిటర్,**
**సీనియర్ జర్నలిస్ట్**
**9701249103**

# ఉత్తమ పీడీగా కమల్‌హాసన్





**పర్వతగిరి/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన మాసాని కమల్‌హాసన్ జిల్లా స్థాయి ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ అవార్డు అందుకున్నారు. సంగెం మండలం తీగరాజుపల్లిలోని నోట్రేడామ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పీడీగా పనిచేస్తున్న ఆయన సేవలను గుర్తించి వరంగల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ డిస్ట్రిక్ట్ యునైటెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (వడుప్సా) ఆధ్వర్యంలో పురస్కారం అందజేశారు.ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తూ, సన్మార్గంలో నడిపించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ప్రిన్సిపాల్ నితీష్, ఉపాధ్యాయులు అభినందించారు.